

# మార్పు

మురారి సుబ్బారావు

ధన్య మాటలకు జానకమ్మ ఉలిక్కి పడింది.

“పెళ్ళాన్ని చిన్నచూపుతో అనే మాటలు నా కిష్టం ఉండవత్తయ్యా! అగ్నిసాక్షిగా పెళ్ళాడిన భార్యను 'ఏమేవ్' 'ఒసేవ్' అని భర్త పిలవడం నాకు నచ్చదు. అలాంటి పిలుపులకు తల ఆడిస్తారే తప్ప ఆ ఆడవాళ్ళు ఎందుకు తిరగబడరో నా కర్థంగాదు. అలాంటి పిలుపులతో పెళ్ళాన్ని బానిసగా చూస్తున్నాడు భర్త” అన్నది ధన్య.

ఆ మాటలకు విస్తుబోయి చూసింది జానకమ్మ.

రేపోమాపో ఇంటి కోడలుగా రాబో

తోంది ధన్య.

'ఏమిటీ వైపరీత్యం పెళ్ళి కాక ముందే ఇలా మాట్లాడుతున్నది. పెళ్ళయ్యాక అరవింద్‌ను రాచి రంపాన పెట్టుదు కదా!' అని తీవ్రంగా ఆలోచిస్తోంది జానకమ్మ. సాయంత్రం భర్త నారాయణరావు ఆఫీసునుండి రాగానే ధన్య అన్న మాటలు చెప్పింది జానకమ్మ. నారాయణరావు పకాల్న నవ్వారు.

"పోనీలెద్దూ చిన్నపిల్ల. ఆవేశంలో అన్నది పట్టించుకోకు. మన కాలం కాదిది. ఇప్పటి కుర్రపిల్లల కోరికలు అభ్యుదయం అంటున్నాయి" అంటూ జానకమ్మ మాటలు కొట్టిపారేశారు నారాయణరావుగారు.

"అదికాదండీ మన అరవింద్‌తో పెళ్ళయ్యాక ధన్య వాణ్ణి ఇలాంటి మాటలతో విసిగిస్తే" సందేహం వెలిబుచ్చింది జానకమ్మ.

"అలా జరగదులేవే" అన్నారు నారాయణరావుగారు. ఇద్దరు చాలా సేపు మాట్లాడుకున్నారు. ఇంతలో ధన్య పెరట్లోంచి రావడంతో మాట మార్చింది జానకమ్మ కాని మనసులో ధన్యమీద కోపంగా వుంది. ఆ కోపం మరో రెండు రోజులకు ధన్య ఊరు వెళ్ళేవరకు తగ్గలేదు.

డిగ్రీ ఫైనలియర్ వ్రాసి మేనత్త ఇంటికి వచ్చింది ధన్య.

మరో రెండునెలల్లో జానకమ్మ చిన్న కొడుకు అరవింద్‌తో ధన్య పెళ్ళి జరగబోతోంది. ఈలోగా మాటల సందర్భంలో ధన్య అన్నమాటలకు మదనపడసాగింది జానకమ్మ. అరవింద్ గురించి కలత పడింది. వద్దన్నపని చేసే మొండిరకం అరవింద్. జానకమ్మ పెద్దకొడుకు చంద్రశేఖర్ రాంచీలో వుంటున్నాడు. అతని భార్య పావని. ఇద్దరు చూడముచ్చటైన జంట. అరవింద్ మద్రాసులో ఉద్యోగం చేస్తున్నాడు. ధన్యతో పెళ్ళి నిశ్చయమైంది కాని అరవింద్...కాస్త కోపిష్ఠి. అతని మనసులో అభిప్రాయాన్ని మార్చడం ఎవరికీ సాధ్యంకాదు. అటువంటి వాడు ధన్యను 'ఒసే' అని పిలిచినప్పుడు, ఇప్పుడన్నట్టుగానే "ఐ హేట్ సచ్ టైప్ ఆఫ్...' అని ధన్య అంటే? ఇక ఇద్దరి మధ్య యుద్ధమే" అంటూ రోజూ భర్త దగ్గర విలవిలలాడేది జానకమ్మ. "అలా జరగదులేవే" అని కొట్టిపారేసేవారు నారాయణరావుగారు. జానకమ్మకు మాత్రం బెంగగానే వుంది.

కొన్ని విషయాలు తీవ్రంగా యోచించవలసినవి కాకపోయినా అవి ప్రవర్తనకు సంబంధించిన వయినప్పుడు వాటికి తప్పకుండా ప్రాధాన్యత వుంటుంది. కంటిపాపంతలేని చీమ కుట్టినప్పుడే కదా నొప్పి తెలిసి ఉనికిని గమనించేది! అందువల్ల ధన్య అన్నమాటలు చీమ కుట్టినట్లుగా అయింది జానకమ్మకు.

దానితో పరిపరివిధాల ఆలోచించిందామె.

చివరకు జానకమ్మ ఒక నిశ్చయానికి వచ్చింది.

ధన్యకు, అరవింద్‌తో పెళ్ళయ్యేలోగా ధన్య మాటల్లోని చేదు అనుభవాన్ని తనే చవిచూడాలి.

వెంటనే భర్తతో విషయం మాట్లాడింది జానకమ్మ.

"మీతో ఒక మాట చెప్పాలనుకుంటున్నాను" అన్నది జానకమ్మ.

"ఏమిటే, త్వరగా చెప్పు!" అన్నారు నారాయణరావుగారు. ధన్య వచ్చివెళ్ళాక జానకమ్మ ఆలోచనలు గ్రహించి ఆమెను ఆటపట్టించాలనే కోరిక కలిగింది నారాయణరావుగార్కి.

"ఈ రోజునుండి మీరు నన్ను 'ఏమేవ్, ఒసేవ్' అని పిలవడానికి వీల్లేదు."

ఆ మాట మిరపకాయ ఘాటు తగిలినట్లయిందాయనకు.

"ఈ వయసులో ఇదేం విడ్డూరం!" అన్నారు నారాయణరావుగారు.

"అదంతా నాకు తెలీదు. నాకు మా అమ్మా నాన్న జానకీ అని పేరుపెట్టారు. మీరు అలా పిలవాల్సిందే. పెళ్ళిలో తలుపు దగ్గర నా పేరు చెప్పారు. ఆ తర్వాత నుండి నేను మీ పిలుపుకి 'ఒసే' అయిపోయాను. ఇక నుండి నన్ను జానకీ అని పిలిస్తేనే పలుకుతాను" అన్నది జానకమ్మ.

"పిలవకపోతే?" అన్నారు నారాయణరావుగారు ఓరగా చూస్తూ.

"పిలిచేలా చేస్తాను. రోజూ కూరల్లో ఇన్నేసి మిరపకాయలు వేస్తాను. ఆ మంటకి మీ గొంతు జానకి అని పిలిచి తీరుతుంది."

"నిన్నటివరకు కాబోయే కోడలు మాటకు మండి పడ్డావు. ఇప్పుడిదేం విడ్డూరం!"

"ఎవరో ఒకరు మారాలిగా. నాకూడా ధన్య ఆలోచనలు కలిగాయి. అంతేకాదు, ఇక ముందు నన్ను మీరు 'ఒసే' అని పిలిస్తే నేను మిమ్మల్ని 'నువ్వు' అని సంబోధించాల్సిఉంటుంది." అన్నది జానకమ్మ ఖచ్చితంగా.

"నీ షరతులతో నా ప్రాణం తోడేస్తున్నావు కదే."

"అదిగో మళ్ళీ. 'తోడేస్తున్నావు కదే' అంటున్నారు. చివర్న 'ఏ' ఎందుకు?" అన్నది జానకమ్మ.

"సరిసరి ఇక అనను. నువ్వు కూడా నన్ను 'నువ్వు' అని పిలువు. 'ఏమయ్యో' అని సంబోధించు పలుకుతాను. కానీ..." అంటూ నవ్వాపుకున్నారు నారాయణరావుగారు.

"ఏమిటో చెప్పండి. మధ్యలో ఆ నవ్వెందుకు?" బింకంగా అన్నది జానకమ్మ.

"ఏరా" అని మాత్రం పిలవకు అన్నారు నారాయణరావుగారు పకపక

నవ్వుతూ.

"రామ రామ. ఎంత అపచారం. మిమ్మల్ని అలా పిలుస్తానటండీ" అంటూ లెంపలేసుకుంది జానకమ్మ.

* * *

ఆ రోజు రానే వచ్చింది.

అరవింద్, ధన్యలకు పెళ్ళి ముహూర్తం నిశ్చయమైంది. వారం రోజులకు పెళ్ళనగా పెద్దకొడుకు, కోడలు రాంచీ నుండి వచ్చారు. అరవింద్ మద్రాస్ నుండి ఎప్పుడు వచ్చేదీ ఉత్తరంకోసం ఎదురుచూస్తున్నారు.

పెళ్ళి పనుల్లో క్షణం తీరిక లేక పోయినా భర్త పిలుపుల్ని గమనిస్తోనే వుంది జానకమ్మ

"జానకీ, శుభలేఖలకు పసుపు రాస్తావా" అనడిగారు నారాయణరావు గారు

జానకమ్మ శుభలేఖలకు పసుపు రాసింది.

కాస్సేపాగి- "అలా బజారుకి వెళ్ళి వస్తాను. ఒక రూపాయుంటే ఇస్తావుటే" అన్నారు నారాయణరావుగారు.

జానకమ్మ గుడ్లురిమి చూసింది భర్తని.

"ఒక రూపాయుంటే ఇస్తావా" అన్నాడు మళ్ళీ. అప్పుడు రూపాయి భర్త చేతికిచ్చింది జానకమ్మ.

నారాయణరావుగారు బయలుదేర బోతుంటే ఈవినింగ్ పోష్టులో ఉత్తరం వచ్చింది. అది చదివి "ఏమేవ్! అరవింద్ రేపు మెయిల్‌లో వస్తున్నాట్ట!" అని వంటింట్లో వున్న జానకమ్మకు వినబడేలా అన్నాడు. జానకమ్మ జవాబుగా ఏమీ మాట్లాడలేదు.

"జానకీ అరవింద్ రేపు మెయిల్‌కి వస్తున్నాట్ట. ఉత్తరం వచ్చింది" అన్నారు నారాయణరావుగారు మళ్ళీ.

ఆ మాటలకు వంటింట్లోంచి ముందు గదిలోకి వచ్చింది జానకమ్మ.

"ఇంత సౌమ్యంగా మాట్లాడరాదూ" అంటూ భర్త చేతిలోని ఉత్తరం అందుకుంది జానకమ్మ.

పావని ఇదంతా వింటోంది. మామగారు మొదటిసారి అన్న మాటకు అత్తగారు జవాబివ్వకపోవడం, రెండో సారి మామగారి మాటల్లోని 'తేడా' గ్రహించింది పావని. చంద్రశేఖర్ దగ్గరకు వెళ్ళి ఈ విషయం చెప్పింది. చంద్రశేఖర్ ఆలోచనలో పడ్డాడు.

"బహుశ నాన్న ఏమే, ఒసేవ్ అని పిలవడం, మాఅమ్మకు ఇష్టంలేనట్లుంది" అన్నాడు చంద్రశేఖర్.

"ఇన్నాళ్ళూ అలాగే పిలిచేవారుగా" అన్నది పావని.

"నిజమే. నువ్వు చెప్పాక నాకు గుర్తుకు వస్తోంది. నిన్నకూడా అమ్మా నాన్న ఈ తీరుగానే మాట్లాడుకున్నారు" అన్నాడు చంద్రశేఖర్.

ఆ క్షణంనుండి మామగారి మాటల్ని

శ్రద్ధగా గమనించసాగింది పావని.

* * *

పెళ్ళి ఘనంగా చేసారు. మరుసటి రోజు బంధువులంతా వెళ్ళిపోయారు. ధన్య కోడలుగా జానకమ్మగారింట అడుగుపెట్టింది. జానకమ్మ ఎన్ని పనులున్నా అరవింద్, ధన్య మాట్లాడుకొనేటప్పుడల్లా వారి ప్రక్కకు వెళ్ళి నిలబడి వాళ్ళు మాట్లాడుకునే మాటలు వినాలనే ఉబలాటం కలిగింది జానకమ్మకు. నారాయణరావుగారు మందలించారు.

"నేను పక్కన వుండగా వాళ్ళిద్దరు మాట్లాడుకుంటే బాగుంటుందండీ" అన్నది జానకమ్మ.

"చాల్చాలు. నీ ఆరాటంతో మతి పోగొట్టుకుంటున్నావు" అంటూ కసిరారు నారాయణరావుగారు. జానకమ్మ కాస్త తగ్గింది. ఆ రాత్రి అరవింద్‌ను చాటుగా పిలిచి అన్నది జానకమ్మ.

"ఒరే...ధన్య ఏమన్నా పట్టించుకోకు అలాగని తందానతానగా వ్యవహరించకు."

"నువ్వేం చెబుతున్నావో నా కర్థం కావడంలేదమ్మా" అన్నాడు అరవింద్.

"నీకెలా చెప్పేదిరా, తల్లిగా నిన్ను ఏమైనా అనే హక్కు నాకుంది. భార్యగా ఇప్పుడు ధన్య వచ్చింది. ఇటు నాకు బాధ కలుగకుండా, అటు ధన్య మనసు నొప్పించకుండా మసలు" అన్నది జానకమ్మ.

"అలాగేనమ్మా, నువ్వు ఇంతగా చెప్పాలా?" అంటూ వంటింట్లోంచి వెళ్ళిపోయాడు అరవింద్

"చూడు, మీ నాన్న నన్ను పిలిచినట్లుగా నువ్వు ధన్యను ఏమేవ్, ఒసేవ్ అని పిలవకు" అన్నది జానకమ్మ.

ఆ మాటకు ఆశ్చర్యపోయాడు అరవింద్.

"ఇదేం కోరికమ్మా!" అన్నాడు.

"అదంతే. చెప్పినట్లు చెయ్యి" అన్నది జానకమ్మ. అరవింద్ నవ్వుకుంటూ వంటింట్లోంచి వచ్చి వదిన దగ్గరకు వెళ్ళాడు

"అమ్మ అలా అన్నదేమిటి?" అంటూ వదినకు విషయమంతా చెప్పాడు అరవింద్.

"నాకూ అదే అర్థంకావడంలేదు. వచ్చినప్పట్నుంచి గమనిస్తున్నాను" అంటూ తను గ్రహించిన విషయాలన్నీ చెప్పింది పావని. ఇద్దరికీ విషయం అంతుబట్టలేదు.

మర్నాడు ఉదయం కోడళ్ళిద్దరితో గుడికి వెళ్ళింది జానకమ్మ. గుళ్ళో పావని పూజారితో మాట్లాడుతుంటే ధన్యను కాస్త దూరంగా తీసుకువెళ్ళింది జానకమ్మ. "అరవింద్ నిన్ను ఏమని పిలిచాడు?" అనడిగింది ధన్యను.

"ఇంకా ఏమనీ పిలవలేదు" అంది ధన్య

"అదేం. రాత్రి మాట్లాడుకోలేదా మీ

రిద్దరూ!" అంది జానకమ్మ.

"నేనే మాట్లాడనివ్వలేదు" అన్నది ధన్య.

ఆ మాటకు జానకమ్మ నీరుకారి పోయింది. 'అనుకున్నంతా అయింది. ధన్య వాణ్ణి తనవైపుకు తిప్పేసు కుంటోంది. కోరి కోడలుగా చేసు కున్నాను' అనుకుంది జానకమ్మ. ధన్య వైపు కోపంగా చూసింది.

"అవునత్తయ్యా! తను మద్రాస్‌లో చూసిన సినిమా యాక్టర్ల ఇళ్ళు ఎలా వున్నాయో వర్ణించి చెబుతుంటే నాకు వళ్ళు మండింది. ఆ మాటల కదా సమయం! వినీవినీ విసుగొచ్చి నిద్ర పోతున్నట్లు నటించాను. నేను నిజంగానే నిద్రపోయాననుకొని మీ అబ్బాయికూడా నిద్రపోయారు" అన్నది ధన్య.

'హమ్మయ్య' అనుకుంది జానకమ్మ. గండం గడిచిందన్నమాట అన్నట్లు ఒక నిట్టూర్పు విడిచింది కానీ అరవింద్ సినిమావాళ్ళ గురించి మాట్లాడ్డం వింతగా తోచింది ఇంటికొచ్చాక అరవింద్‌ను పిలిచి అడిగింది జానకమ్మ.

"ఏరా! సినిమావాళ్ళ గురించి మాట్లాడానికి సిగ్గులేదూ!"

"నువ్వే కదమ్మా! ధన్య మనసు నొప్పించకుండా మెలగమన్నావు" అన్నాడు అరవింద్ తల్లి ముఖకవళిక్ని ఒక కంట కనిపెడుతూ.

"నా ఖర్మ. నువ్విలా మాట్లాడితే పట్టి మొద్దావతారం అనుకుంటుంది" అంటూ ధన్యతో కాస్త ఇదిగా మాట్లాడ మని నాలుగుసార్లు చెప్పింది.

అరవింద్ వదినతో ఈ విషయాలు చెప్పాడు. గుళ్ళో తనను పక్కకు పిలిచి అత్తయ్య అడిగిన విషయాలు అప్పటికే ధన్య పావనితో చెప్పింది. వీటన్నిటినీ చంద్రశేఖర్‌తో చెప్పింది పావని. ఎవ్వరూకూడా జానకమ్మ మనసులోని బెంగ గ్రహించలేకపోయారు.

ఆ తర్వాత నాలుగురోజులకు చంద్ర శేఖర్, పావనీ రాంచీ వెళ్ళిపోయారు.

ఆ రోజు సాయంత్రం ధన్య, అర వింద్ సినిమాకు వెళ్ళారు! ఇంట్లో జాన కమ్మ నారాయణరావుగారు వున్నారు.

వాలుకుర్చీలో కూర్చుని జరిగిన పెళ్ళి సంఘటనలు ఆలోచిస్తున్న నారాయణ రావుగారి దగ్గరకు వచ్చి కూర్చుంది జానకమ్మ. ఎవరికి వారు ఏదో ఆలోచ నల్లో వున్నారు.

"ఏం జానకీ మాట్లాడకుండా వచ్చి కూర్చున్నావు!" అన్నారు నారాయణ రావుగారు.

జానకమ్మ మాట్లాడలేదు.

"నిన్నేనోయ్. నన్ను 'నువ్వు' అంటూ సంబోధిస్తానన్నావు. ఏదీ ఒక్క సారి పిలు."

జానకమ్మ చివ్వున తలెత్తిచూసింది. ఆమె కళ్ళనిండా నీళ్ళు.

"ఛ, ఎందుకా ఏడుపు" అన్నారు

నారాయణరావుగారు.

"అరవింద్, ధన్య ఎలా వుంటారో అవి బెంగగా వుందండీ" అన్నది జానకమ్మ.

"వాళ్ళకేం విశేషంగా వుంటారు" అన్నారు నారాయణరావుగారు.

"అదికాదండి. ధన్య పరీక్షలయ్యాక మన ఇంటికి వచ్చినప్పుడు ఒక మాట న్నది గుర్తుందా? ఆ సంఘటన మరచి పోలేకపోతున్నాను. ధన్య మనవాడిమీద చిర్రుబుర్రుగా వుంటుందేమోనని భయంగా వుంది."

"నీ వన్నీ లేనిపోని భయాలు జానకి మాట అన్నంత మాత్రాన మనసులో అభిప్రాయాలు చెప్పినంత మాత్రాన మనుషులు అవే ఆచరిస్తారనుకోవడం భ్రమ. మనిషి ఎంత మార్పును కోరుతున్నాడో అంతగా మన ఆచార వ్యవహారాలకు కట్టుబడి వున్నందువల్ల మన సంస్కృతికి ఒక ప్రత్యేక గుర్తింపు వుంది. అదీగాక మారుతున్న కాలానికనుగుణంగా మార్పుకోరడం తప్పుకాదు. పలికే గొంతుకన్నా, పలికించే గుండెల్లో అభిమానముండాలి జానకీ. అది లేని నాడు పిలుపు ఏదయినా ఒక్కటే" అన్నారు నారాయణరావుగారు.

"మీ రెన్నయినా చెప్పండి. ధన్య అన్న మాటలకు నాకు చాలా పట్టింపుగా వుంది."

నారాయణరావుగారు జానకమ్మ ధోరణికి నవ్వుతున్నారు. "నీ దంతా అనవసరపు రాద్ధాంతం సుమీ" అన్నారు

కాసేపు ఇద్దరూ మౌనంగా వున్నారు. కొన్ని క్షణాలకు "జానకీ" అని పిలిచారు నారాయణరావుగారు.

జానకమ్మ పలక లేదు.

"నిన్నే జానకీ, కాస్త కాఫీ పెట్టు. అలా లైబ్రరీ వరకు వెళ్ళి వస్తాను."

జానకమ్మ పలుక లేదు. ఆమె మనసులో ధన్య, అరవింద్ మెదులుతున్నారు. ధన్య మాటలు గుర్తుకు వస్తున్నాయి. మూడోసారి పిలిచినా పలుక లేదు జానకమ్మ.

నారాయణరావు గారికి విసుగని పించింది.

"ఏమే. కాస్త కాఫీ పెడతావా!" అన్నారు విసుగ్గా.

జానకమ్మ తేరుకుంది.

"ఏమిటీ? పిలిచారా?" అన్నది.

"కాస్త కాఫీ పెట్టవే" అన్నారు నారాయణరావుగారు.

జానకమ్మ దిగ్గున లేచి వంటింట్లోకి వెళ్ళింది.

* * *

భార్యాభర్తల మధ్య అరమరికలులేని దాంపత్యంకోసం సృషించబడ్డట్టు చీకటి చిక్కగా వుంది. కిటికీల్లోంచి చల్లటిగాలి వీస్తోంది. గదిలో బెడ్‌లైట్ కాంతి సన్నగా పడుతోంది.

సినిమా చూసివచ్చి భోజనంచేసి తమ గదిలో పడుకున్నారు అరవింద్, ధన్య. జానకమ్మ వంటింట్లో గిన్నెలు సర్దుతున్న చప్పుడు వినిపిస్తోంది.

"చాల్లెద్దూ. ఎపుడూ చాకిరమే. ప్రొద్దున్న లేచి చూసుకోవచ్చులేవే" అన్నారునారాయణరావుగారు. వంటింట్లో వున్న జానకమ్మకు వినిపించేటట్లుగా.

"ఐపోయింది. వచ్చేస్తున్నా" అంటూ

వంటింట్లో లైటార్పి వచ్చేసింది జానకమ్మ.

ఇద్దరి మాటలు చెవినబడి నవ్వగా నవ్వాడు అరవింద్. "మా అమ్మ వట్టి భోళామనిషి." అన్నాడు ధన్యతో.

"నా కలా అనిపించడం లేదు. అయినా మీరు మీ అమ్మను భోళామనిషి అనడం తప్పు కదూ! వింటే మీ అమ్మ బాధపడతారు" అంది ధన్య.

"ఎందుకు బాధ."

"ఆమె నిజంగా భోళామనిషి కమక" అంది ధన్య పక్కున నవ్వుతూ.

"ధన్యా!" అన్నాడు అరవింద్.

"ఊఁ!"

"నీకొక విషయం చెప్పాలనివుంది."

"ఏమిటో చెప్పండి"

"నన్ను నువ్వు 'మీరు' అని సంబోధించడం నా కిష్టంలేదు."

"అదేం కోరిక!" అన్నది ధన్య నవ్వుతూ

"చిలిపి కోరిక."

ధన్య కొన్ని క్షణాలు మాట్లాడలేదు.

"మన పెళ్ళికి ముందు నేనూ మీలాగే అనుకున్నాను" అంటూ ఒకసారి తను అన్నమాటలు చెప్పింది.

"మరికనేం! ఇప్పుడిక ఆచరించు" అన్నాడు అరవింద్.

"నాకు ఇష్టమే. మిమ్మల్ని మీరు అనాలంటే ఏదోగా వుంది. నా కన్నా వయసులో పెద్ద. అంత మాత్రానికి మీరు అని సంబోధించాలా? కొంతమంది పిల్లలు తండ్రిని 'నాన్నగారూ' అని పిలుస్తారు మరికొంతమంది 'నాన్నా' అంటూ తల్లితో సంబోధించినట్లే సంబోధిస్తారు. కట్టుకున్న భార్యను, కడుపున పిల్లలకు కూడా పిలుపు విషయంలో తేడాలుండడం నాకు నచ్చదు" అన్నది ధన్య.

"నా అభిప్రాయంకూడా అదే ధన్యా."

"కానీ నా పిలుపు అత్తగారి చెవిన బడి ఏమైనా అనుకుంటారేమో" అన్నది ధన్య.

"ఏమీ అనుకోదు. అనుకున్నా విడమర్చి చెప్పడానికి నాన్నగారున్నారు. మారే కాలం, అమ్మ మారుతుంది" అన్నాడు అరవింద్.

"నేను కూడా అత్తగార్ని అడుగుతాను."

"అడగొద్దు నేనే అలా పిలవమన్నానని అమ్మతో చెబుతాను" అన్నాడు అరవింద్.

"సరే మీ ఇష్టం."

"అలాక్కాదు. ఇకనుండి నీ ఇష్టమే నా ఇష్టం అనాలి" అన్నాడు అరవింద్.

"అవును. నీ ఇష్టమే నా ఇష్టం. నువ్వే నేను, నేనే నువ్వు" అన్నది ధన్య.

అప్పటికే అరవింద్ ధన్యను అక్కున చేర్చుకున్నాడు. * *

ఆదూరి సావిత్రి

# చీకటి - వెన్నెల

జూలై' 87 యువలో కొత్త సీరియల్ ప్రారంభం